క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేతల సమావేశం నేడు

దుగ్గిరాల: వైఎస్సార్ సీపీ క్రియాశీలక కార్యకర్తల సమావేశం కంఠంరాజు కొండూరు గ్రామంలో బుధవారం జరుగుతుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు డి. శివగోపయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొని, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు.

వేగవంతంగా పీఎంజేఏవై నమోదు



ఫిరంగిపురం: మండలంలోని పలుగ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పీఎంజేఏవై (ప్రధాన మంత్రి జన ఆరోగ్యయోజన) యాప్‌లో నమోదు చేస్తున్నారని డాక్టర్ శ్వేత మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ 70 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి ఆరోగ్య బీమా కోసం వివరాలు నమోదు చేస్తున్నారని చెప్పారు. అలాగే రేషన్ కార్డులో పేర్లు ఉండి ఫోన్ నంబరుతో లింకు అయిన వారివి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా దేశంలో ఏ ప్రాంతంలో అయిన ఐదు లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుందని చెప్పారు. చికిత్స పొందవచ్చని చెప్పారు. మార్చి 25 నుంచి గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది వీటిని నమోదు చేస్తున్నారని తెలిపారు.

7 నుంచి ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మార్నింగ్ స్టార్ కళాశాలలో ఈ నెల 7వ తేదీ నుంచి స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్ సబ్జెక్టులలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మద్దు బాలస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లీషు, గ్రామర్, పబ్లిక్ స్పీకింగ్, అడ్వాన్స్‌డ్ ఇంగ్లీషులో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణకు పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. 6వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని, ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వరకు క్లాసులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుగ్గిరాల: పెదపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో రెండు దశలుగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ వసంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు రేవేంద్రపాడు, శృంగారపురం, గొడవర్రు, వీర్లపాలెం, పెదపాలెం, పెదకొండూరు గ్రామాలు, సాయంత్రం 2 నుంచి 4 గంటలవరకు పెదపూడి, చినపాలెం, పెదపాలెం గ్రామాల్లో ఈ అంతరాయం ఉంటుందని తెలిపారు.

మొక్కలు మనకు నేస్తాలు



తాడేపల్లి రూరల్ : మొక్కలు మానవులకు నేస్తాలని, మొక్కలు లేకపోతే జీవించలేమని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకుడు పురాణం వెంకటాచార్యులు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ఆశ్రమంలో వేద విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలకు మొక్కలు నాటడం అలవాటు చేయాలని, రేపటి తరానికి చెట్ల ప్రాధాన్యతను వివరించాలన్నారు.

బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురి అరెస్ట్

మంగళగిరి: పట్టణంలోని నిడమర్రు గ్రామ పరిధిలో ఉన్న టిడ్కో నివాసాల వద్ద బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బహిరంగంగా మద్యం సేవించి, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేసి, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. రూరల్ పరిధిలోని గ్రామాల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేసి బహిరంగంగా మద్యం సేవించేవారిని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిని అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

తాడికొండ: తాడికొండ మండలం లాం గ్రామంలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. సుమారు 65 సంవత్సరాల వయస్సున్న వృద్ధురాలు చలపతి కళాశాల ఎదురుగా ఉన్న ఆర్ఆర్ విల్లాస్ ఎదురుగా మృతి చెంది పడి ఉన్నట్లు గుర్తించిన తాడికొండ పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సీఐ కె.వాసు స్పందిస్తూ.. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

ప్రాథమిక బడి.. పట్టించుకోండి

- శిథిలావస్థలో కురగల్లు ప్రాథమిక పాఠశాల భవనం
- చర్చి ఆవరణలో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- నాడు–నేడులో రూ.26 లక్షలతో నూతన భవన నిర్మాణం
- ప్రభుత్వం మారడంతో నిలిచిన పనులు
- మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని వైనం



నిర్మాణం నిలిచిపోయిన పాఠశాల భవనం



చర్చి ఆవరణలో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మంగళగిరి: పాఠశాలలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. అందుకు ప్రత్యక్ష నిదర్శనం కురగల్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం. పాఠశాల శిథిలావస్థకు చేరి, పెచ్చులూడుతుండడంతో భవనం వదిలి.. తరగతులను పక్కనే ఉన్న చర్చిలో నిర్వహిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వంలో మనబడి నాడు – నేడు పథకం కింద నిర్మాణం చేపట్టిన నూతన భవనాన్ని పూర్తి చేద్దామన్న ధ్యాస కూడా లేదు. పైగా ఇది విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలోని పాఠశాల. పాఠశాల భవనం దుస్థితిని ఇప్పటికే మంత్రి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా.. పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులే చెబుతున్నారు. కనీసం అధికారులు అయినా...సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. కురగల్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరి భవనం పెచ్చులు ఊడి విద్యార్థులకు గాయాలవుతుండడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరగతులను పక్కనే ఉన్న చర్చిలో మార్చారు. గ్రామంలో వివాహమైనా, శుభకార్యాలైనా చర్చిలోనే నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు సగం రోజులు సెలవులు తప్పడం లేదు.

నిలిచిన నాడు – నేడు పనులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మనబడి నాడు–నేడు కింద రూ.26 లక్షలతో పాఠశాల నూతన భవనానికి శ్రీకారం చుట్టారు. పనులు మధ్యలో ఉన్న సమయంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు అటకెక్కాయి. ఆరు నెలల క్రితం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గ్రామంలో పర్యటించిన సమయంలో గ్రామస్తులు పాఠశాల దుస్థితిని వివరించారు. దీంతో స్పందించిన మంత్రి వెంటనే పనులు ప్రారంభించి, పూర్తి చేస్తామని భరోసానిచ్చారు. కానీ, ఇంత వరకు పనులు ప్రారంభం కాకపోవడంతో గ్రామంలోని టీడీపీ నాయకులు పలువురు మంత్రి కార్యాలయంలో సమస్యను విన్నవించారు. అయినా పాఠశాల భవన నిర్మాణం మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది.

మంత్రికి పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యం

ఇటీవల నగరంలో పర్యటించిన మంత్రి లోకేష్ దృష్టికి గ్రామస్తులు మళ్లీ పాఠశాల సమస్యను తీసుకెళ్లారు. తన నియోజకవర్గంలో ఏ స్కూలుకు ఆ పరిస్థితి మంత్రి సమాధానం ఇవ్వడ విశేషం. గ్రామస్తులు వాస్తవాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేయడంతో తన కార్యాలయంలో సిబ్బందిని స్కూలు పరిస్థితిపై మంత్రి వివరణ కోరారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితిని మంత్రికి వివరించారు. అయినా ఇప్పటి వరకు స్కూలు భవనం పనులు ప్రారంభం కాలేదు. 43 సంవత్సరాల క్రితం 1982లో ప్రారంభించిన పాఠశాల భవనం ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ముగ్గురు టీచర్లు, 50 మందికి పైగా విద్యార్థులతో కళకళలాడిన పాఠశాల నేడు 23 మంది విద్యార్థులకు పరిమితమైంది. కనీసం అధికారులైనా స్పందించి, నాడు – నేడులో చేపట్టిన స్కూలు భవనం నిర్మాణం పూర్తి చేసి తరగతులు నిర్వహించాలని స్థానికులు, విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



స్లాబు పెచ్చులూడిన పాత భవనం

మహాసభలను జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్ : రజక వృత్తిదారుల సమస్యలపై ఈ నెల 20–21 తేదీలలో కొండపల్లి పట్టణంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని చిట్యాల ఐలమ్మ రజక కల్యాణ మండపం వద్ద పాగోలు శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం మంగళగిరి, తాడేపల్లి పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం రజక అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించకపోవడం, బడ్జెట్‌లో కేటాయించిన నిధులను రజకుల అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేయకుండా ఇతర అవసరాలకు మళ్లించడం వల్ల రజకుల స్థితిగతులు నేటికీ దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీటీ పీఎస్ బీ 1 కాలనీ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏప్రిల్ 20వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు బహిరంగ సభ నిర్వహించి, రాష్ట్ర వ్యాప్తంగా హాజరైన ప్రతినిధులతో 21వ తేదీ రజక మహాసభలందు సమస్యలపై చర్చించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు కొండయగుంట యానాది రావు, మాచవరపు నరసింహారావు, తాడేపల్లి సాంబశివరావు, కొత్తపల్లి వీరాంజనేయులు, తాడేపల్లి ఆంజనేయ వరప్రసాద్, ధరణికోట వీరాంజనేయులు, కొడాలి శ్రీనివాసరావు, బాబూరావు, బాలకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

లంక భూములకు పట్టాలివ్వండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దుగ్గిరాల: సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయలం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఎంతోకాలంగా సాగు చేస్తున్న లంక భూములకు పట్టాలిస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీని నెరవేర్చడం లేదని పెదకొండూరు గ్రామ రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. 70 ఎకరాల లంక భూమిని 40 మంది రైతులు ఎంతో కాలంగా సాగుచేసుకుంటున్నట్లు చెప్పారు. మండలంలోని తుమ్మపూడి, మంచికలపూడి గ్రామల్లోని రెండు తోపుల్లో 35 ఏళ్లకు పైగా నివాసం ఉంటున్న పేదలందరికీ నివాస స్థలాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నానుద్దేశించి సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ.. సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్రలు చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకున్నామని చెప్పారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఐ.సునీతకు అందజేశారు. జెట్టి బాలరాజు, ఎం.నాగమల్లేశ్వర రావు, జి.శ్రీనివాస రావు, చిరంజీవి పాములు, శేషగిరి, దాసరి విజయలక్ష్మి తదిదరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో విజిబుల్ పోలీసింగ్



గౌతమ బుద్ధ రోడ్డులో విజిబుల్ పోలీసింగ్

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని గౌతమ బుద్ధ రోడ్డు కొత్త బస్టాండ్ వద్ద నుంచి పాత బస్టాండ్, వైదేహి సెంటర్ వరకు మంగళవారం పోలీస్ సిబ్బందితో కాలినడక ద్వారా విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వినోద్‌కుమార్ మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్ వల్ల నేరాలు అరికట్టడానికి, ప్రజలకు భద్రత కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. బహిరంగంగా పోలీసులు కనబడడం ద్వారా ప్రజలకు భద్రతా భావం కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ జోన్‌లు ఆక్రమించిన వాహనాలను ట్రాఫిక్‌కు అవరోధం లేకుండా మార్జిన్ లోపలకి సిబ్బందితో కలసి జరిపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్, క్రైమ్ సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు, సుధీర్, సిబ్బంది శివయ్య, పలువురు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

తాడేపల్లిలో స్వచ్ఛ ఆంధ్ర



ర్యాలీలో పాల్గొన్న ఎంటీఎంసీ అధికారులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి 17, 18 వార్డు సచివాలయాల్లో మంగళవారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ తాడేపల్లి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై అవగాహన కోసం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రజల్లో మరింత చైతన్యాన్ని కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలా వ్యాధులను నివారించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శ్రీకాంత్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, టీడీపీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, ప్రధాన కార్యదర్శి దారా దాసు, అద్దంకి మురళి, కంభం సాయి చంద్, కె.మహాలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.


సుపరిపాలనలో మోదీ ప్రభుత్వం విఫలం



ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

మంగళగిరి టౌన్ : దేశ ప్రజలకు సుపరిపాలన అందించడంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఐ కార్యాలయం వద్ద మంగళవారం రావుల శివారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ దేశ వ్యాప్తంగా మార్చి 23 భగత్‌సింగ్ వర్ధంతి రోజు నుంచి ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి వరకు నరేంద్రమోదీ వికృత చర్యలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మోదీ రైతు వ్యతిరేక విధానాలను తీసుకువస్తూ రైతులను దారుణంగా మోసం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, నాయకులు నందం బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు కోట బాబూరావు

తాడేపల్లి రూరల్ : ప్రభుత్వం నిలుపుదల చేసిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి కోట బాబూరావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్‌లో బత్తుల రాజు భవన్‌లో బి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమిని గెలిపిస్తే సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్మికులందరూ ఐకమత్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సంక్షేమ బోర్డును సాధించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులు భుజంగరావు, వెంకటేష్, ప్రభు, శేషగిరి రావు, శివాజీ, శివ, ఖదీర్, బి.శ్రీను పాల్గొన్నారు.

నేడు టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపికలు

మేడికొండూరు : మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్‌లో బుధవారం జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రన్ను హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో పిడుగురాళ్లలో రాష్ట్ర స్థాయి పోటీలుంటాయని తెలిపారు. వివరాలకు 99661 22055 నంబరుని సంప్రదించాలన్నారు. అండర్ 19 విభాగానికి సెలక్షన్స్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని, ఎంట్రీ ఫీజు రూ.100లని తెలిపారు.

స్కేటింగ్ క్రీడాకారుడికి అభినందన



తాడేపల్లి రూరల్: అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారుడు తాడేపల్లిలోని డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల ఆశిష్ ను టీడీపీ నాయకులు మంగళవారం అభినందించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ.. తైవాన్‌లో జరిగిన స్కేటింగ్ పోటీల్లో ఇండియా నుంచి ఫ్రీ స్టయిల్, ఇన్‌లైన్, సోలో డాన్స్ విభాగాల్లో ఆశిష్ సిల్వర్ మెడల్స్ సాధించాడని తెలిపారు. అద్దంకి మురళి, కొర్రపాటి విజయ్ పాల్గొన్నారు.

ఉత్తమ లఘు చిత్రాలకు అవార్డుల ప్రదానం



విద్యార్థి అఖిల్‌సాయికి ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డు ప్రదానం

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన సినీ ఫిలియా 2025 జాతీయ స్థాయి ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శించిన ఉత్తమ లఘు చిత్రాలకు మంగళవారం పురస్కారాలు ప్రదానం చేశారు. లలిత కళల విభాగాధిపతి డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ ఫిలిం మేకింగ్, ఫొటోగ్రఫీ, ప్రొడక్షన్ డిజైన్‌లలో జాతీయ స్థాయి ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించామని తెలిపారు. ఉద్యోగాల కల్పన డీన్ డాక్టర్ ఎస్.బి.వి. ప్రసాద్ స్టూడెంట్ మ్యాగజైన్ క్యాన్వాస్ 2025ను విడుదల చేశారు. అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె. రాజశేఖరరావు, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ తదితరులున్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

కేఎల్ యూనివర్సిటీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు మంగళవారం ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథి ఇటలీ యూనివర్సిటీ ఆఫ్ బ్రెస్సియా ప్రతినిధి డాక్టర్ మోనూబైతా మాట్లాడుతూ పర్యావరణ హితమైన పరిజ్ఞానంతో భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందన్నారు. కేఎల్‌యూ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుమన్ మాలోజీ మాట్లాడుతూ ఈ సదస్సుకు చైనా, తైవాన్, ఇటలీ, ఇండియాలోని ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీల నుంచి మొత్తం 176 మంది ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. బెంగళూరు ఇస్రో శాస్త్రవేత్తలు రాజా వి.ఎల్.ఎస్. శ్రీధర్, ఆర్అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ బీటీపీ మాధవ్, సలహాదారులు డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు. అనంతరం హాజరైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

సామాజిక పెన్షన్లు పంపిణీ



పింఛను నగదు అందజేస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ భరోసా కింద లబ్ధిదారులు అందజేసే పెన్షన్లను ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని 18వ వార్డులో అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని సచివాలయంలో ఉదయం 6 గంటల నుంచే పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. 7 గంటలకు 71 శాతం అయ్యిందని, 9 గంటలకు 95 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయస్థాన తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలి



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న దుర్గారావు

తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పు ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె. ఆదినారాయణతో కలసి సందర్శించి సంఘీభావం తెలియజేశారు. సుమారు 350 కుటుంబాలతో ముడిపడి ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని కోరారు. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులు మాత్రమే తాము అమలు జరపాలని కోరుతున్నామని తెలిపారు. వై. యెహోషువా, కె. హగ్గయ్య, గురవయ్య, ఆశీర్వాదం, ఇమాండి, రిబ్కా, నవనీతం, అంకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సాయి లక్కరాజుకు కళాదర్బార్ పురస్కారం

తెనాలి: గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో గల అన్నమయ్య కళావేదికలో కళాదర్బార్ వ్యవస్థాపకులు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో తెనాలికి చెందిన స్వరలయ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజుకి కళారంగంలో చేస్తున్న విశిష్ట కృషికి ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆలయ కార్యదర్శి బి.ఉమామహేశ్వరరావు, చెన్నుపాటి శివనాగేశ్వరరావు, పొత్తూరి రంగారావులు సాయి లక్కరాజును సత్కరించి, ఉగాది పురస్కారాన్ని బహూకరించారు. తనకు జరిగిన సత్కారానికి సాయి లక్కరాజు స్పందిస్తూ తన జిల్లాలో జరిగిన సత్కారం కన్నతల్లి అందించిన అభినందనలతో సమానమన్నారు.

కాశీ మహోత్సవంపై ప్రవచనం



తెనాలి: స్థానిక రామలింగేశ్వరపేటలోని దుర్గాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి మహోత్సవాల్లో భాగంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం దేవస్థానం ప్రాంగణంలోని లలితాధామం వేదికపై ప్రముఖ ఆధ్యాత్మిక పండితుడు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ 'కాశీ మహోత్సవం'పై ప్రవచనం చెప్పారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు ఆద్యంతం భక్తిశ్రద్ధలతో ఆలకించారు. బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథ శర్మ, వేద పండితుడు విష్ణుభట్ల ఆంజనేయ శర్మ, ఆలయ అర్చకులు వడ్లమూడి రాఘవేంద్ర శివప్రసాద్ పాల్గొన్నారు. పుచ్చ శైలజ, గోపాలకృష్ణలు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.